అవసరాల రామకృష్ణారావు



# సెరగని సెప్పుదెబ్బ

కాలికి సెప్పులేవని నన్నెప్పుడూ అడగ మా కంది, ఐతుకుమీన బెమ పూరాగా చచ్చిపోలేదు మరి!

ం

ఇంతకీ ఆ పొద్దు తెగిచిన యాలా యిసేసం. కనిగోడు నెత్తిన తంతుంటే యింకోసోటుకి కాలేల దారితీసుద్ది? ఎల్లిన ఎవ్వారం నచ్చనంగ అయినాది గందా, కమీసన్ పైసలు మస్తుగ దొరికి బాంకిలో జమకట్టేసినాను గందా, వొచేలుకు జేరుకుని రైలు టయాముదాక వల్లక తొంగోరాదా? సేసుకున్న కర్మ తప్పుద్దా!

ఇంతకీ గడియకేటి జరుగుతాదో సెప్పుగలవేంటి, సెప్పి!

మయాన ఏదాంతమేల, జరిగినకత యిదిగో యిదీ;

లచ్చింతల్లి సల్లగసూసి పిటీ ఎల్లినపని నాబంగ అయిందని సెప్పినాను గంద, అప్పటికి రెండయినాది. రేతిరికి గాని తిరుగు బండి నేదు. కడుపుల కరకరలాడతాఉంటే మస్తుగ పలారంకానిచ్చి వొచేలునుంచి అట్టట్టా పెద్ద బిడిజీ దుక్కాల నడిచిన ఆ దుక్కాల ఎక్కువ జనం బయలెల్లరు. గాలి సల్లంగ యిత్తాది. ఆద కూకుతుంది పయిపేనం పయినె లెగిసిపోతాది.

ఆ పొద్దూ అట్టనే కాల్లూపుతూ కూలబడినా, కాళ్ల దుక్కాల సూత్తా ఉంటే సెప్పులమీద సూపు నిలిచినాది. సంటితల్లి ఎచ్చరికలు యాదస్తుకొచ్చినయ్.

"నీ దైరుజోడు సూడలేక సస్తాఉన్నాం అయ్యా! అదిని ఏసుకుని నువ్వు నడస్తాఉంటే మద్దిన సిగ్గుతో మాం సచ్చిపోతున్నాం. నా వొయసు ఉంటుంది అదికి! ఎన్నిసుట్లు కుట్టేయిందావో యా తలికి! ఇంకెన్నేల్లు సెమ ఎడతావయ్యా అదిని? ఏల్లతరబడి తొక్కుతాఉంటే బిక్కసచ్చి ఏంతిట్టుకుంటున్నయ్యో.... నామాటిని అదికి ఇడుదల పెసాదించు. ఇన్ని లచ్చలుండి యిదేం బిర్రుగాతి బుద్ధయ్యా!"

సంటితల్లి నా బొట్టి. సెంద్రలేకలో ఈరోయినంత సక్కని మొగం దాన్ది. అయితేట్నాబం. సిన్నప్పుడె పెద్దామ్మోర్వొచ్చిన ప్పుడు కుడికాలు లాగేసినాది. ఆ ఒక్కలోటూ లేకపోతే దాన్సుట్టూ చూర్య సెంద్రులు తిరక్కపోదురా! ఈ అల్లాటప్ప కిట్టప్పని సేర దీసి ఉండునా?

ఆరుమాతరం వొవడు? సాయాన సెల్లెమ్మ బొట్టైదు. ఇంత సేర్చి సదుం సెప్పించిన. అర్ధమైన గాద్ది కొడుకుల కొల్లట్టుకోని వుద్యోగం ఏయించిన. మల్ల అసుమంటి వుద్యోగమా! ఇన్స్పరెన్సు కంపెనీల పని. పని సేతులోపద్దాక నాలుక్కొంపలు తిరిగి ఇన్సూరెన్సు సేయించుతని కమీసన్ కొట్టుకురావాల్నా! కాటోయె పెల్లాం కోక ఒట్టుకోని సచ్చినోడు యిల్లు కదలడే! పోనీ మా యింటి దాయి సెప్పొద్దుటండీ? ముండ నోరిప్పదే!

ఒకల్లని ఏల అనుకోవాల. మాయింటి ఆడంగులున్నారే అంతటి కరుసుదారి మడుసులు ఆపదరు. ఏలకి ఏలుతెచ్చి సేతులో ఎట్టుసాల్దనే గోల! అ మాలచిమి తల్లిని ఎంత గవురవంగ సూసుకోవాల, ఎన్ని సెమటసుక్కలు కార్సుకుంటె ఒక్కపైసా సేతుల

పడుద్ది ఆ మాతరం గేనం ఉండొద్దా? తే, తే అని లెయ్ లెయ్ మంటే తెచ్చే మొగాడు ఎందిల పడాల? ఈ ఆడముండలు సాలక బుద్ది గడ్డితిని ఆ అడారి నా కొడుకుగోడ్ని యిల్లు సేర్సిన. ఓ పైసా సేతల నిలవాలంటే పేనం ఎంత కట కటలాడిపోతాదో కూకుని గుటుకూగుటుకూ బొక్కే యీ పందికొక్కు పీనుగలకి ఏటితెలుస్ది?

ఇంతకీ ఇంటిగుమ్మం దిగకపోతే పోయె కిట్టప్పగోడి కటు రేటో ఎరికెనా? నానే బీమా సెయ్యాలంట? ఏటి సెప్పమంతరు, రెండు లచ్చలకి ఇన్సూరెన్సు సెయ్యమని, పీకలమీద కూకుడోని, నా సెవులోనే యిల్లు గట్టుకోని పోరె. అరి దొంగెదవా, నువు సెప్పి నట్టే సేత్తే, నాకింకా యీ బూమ్మీద నూకలుంచుతారా మీరు? నాను ఛత్తే ఎంచక్కా బీమాపైసలు అందుకోని ఆయిగ కులుకుదామనా? ఎంత సదూకోకపోయినా ఇంత ఏపాతం ఒక్కసేతిన నడుపు తున్నా... మరీ అంత ఎర్రిపీరు అనుకోమాకండి మరి... అదు ఆసరా సూసుకోని తల్లీకూతుల్లు ఎలా నోరుపారేసుకునేవోరని!

"నువ్వు లచ్చలులెచ్చి మాకేటినాటం? మార్కెట్ల రోజుకో సరుకూ పూటక సీరా దిగి, కల్లు జిగేలుమంతున్నయ్! మనమీన తక్కువోల్లె దరిజా ఎలిగిస్తూంటే, డబ్బుండి యిట్ల పీనాసిబతుకు ఈడుస్తున్నాం మనం! ఎన్ని సుట్లడిగినా గీసి గీసి సేతులో ఎద తావ్! నీ లాంటోడు తెచ్చినా తేకున్నా ఒకటే!"

అనండే, అనండి! సచ్చినా బతికున్నా ఒకటే అన్నాఅనండి పైసా యిలవ తెలీనోల్లకి పైసా నిలవ ఎలా తెలుస్తాది!

పెద్ద బిడిజీ మీద కూకుడోని కాల్లూపుతూ సెప్పులు సూస్తా ఉంటే బుర్రలో ఎన్ని ఆలోసనలన్నా గిర్రున తిరిగినయ్.

"నీకేవేఁ సంటితల్లీ, సెప్తావు? నీలా మీయమ్మలా నానూ ఏడాదికి నాలుగేసి జోల్ల జతలు మారుస్తూ ఉంటే యింట యీపాటికి పస్తులే మిగిలి ఉండేవి. రొండుదుక్కలా కావ్వాత్తి ఎలిగిస్తే ఎంతల అయిపోవాల!"

అలా సూస్తా ఆలోసిస్తానే ఉన్నా.

సూపు ఏటో కనిపెట్టి సటుక్కున ఆలోసన ఆగిపోనాది.

ఊపుతున్న కాల్లని అపి సూత్తే సంగతి పట్టుబడిపోనాది.

ఓ కాలికే సెప్పున్నాది! వెడంకాలికి లేదు! ఏటయినాది?

తొంగుని సూసినాను... కమ్మలం మద్దిలగాడినుంచి జారి పోనాది పైకలా అపడతాడిగాని పెద్ద బిడిజీకింద ఎంత లోతు సొరంగం! ఊరంతటి [డెయినేజి మయిలనీరూ అడనే సేరుతాదం టారు. కల్లు సించుకుసూసిన మీనగాని ఆపడలేదు పడిపోయిన సెప్పు. ఓ రాయిగుట్టమీన మొలచిన ముల్లతుప్పల సిక్కుకున్నాది సెప్పు. తెగించి దిగగలిగితె మడిసిదూరే కన్నం ఓ దుక్కల నేక పోలేదు.నిలువునా అంతలోతూ గెంతాలేగాని పటుకోను ఆదారం నేదు! పేనాల మీన బెమ ఒగ్గేసి లోతట్టుకి సేరినా ముంగల నల్లని బురద. అది దాటందె సెప్పు అందదు.

పేనం మాకొట్టుకుపోనాది.

కల్ల గిర్రున నీలు తిరిగినయ్.

నానేడబోతే ఆడ వచ్చేవి. ఏ పదేళ్ళమట్టి నాతో సంబందమో! ఈటితో ఎన్ని ఎవ్వారాలు సక్కబెట్టిన! ఎన్నిదుక్కాలం సుట్టబెట్టిన!

సంటితల్లి ఎక్కిరి పించినట్టు అయినాది.

"సూసినావా అయ్య ఏటి జరిగినాదో? ఆ సెప్పుల బాద సూసి బరాయించుకోనేక రొండు సుట్టు యీది కాలవలో యిసిరేస్తే నెలికి తెచ్చుకు కత్తుకుంతన్నవ్ గానిఒగ్గినేకపోనావ్. నీ కక్కురితి మండిపోను నువ్వుతినవ్ వొకరికి ఎట్టవ్....అందుకనే బగుమంతుడు యీ ఇదంగ బుద్ధి సెప్పినాడు.... ఇంటికి సేరగనె నిలత్త, ఆ తోలు ముక్కలు ఏక ఒగ్గిసినావని ... ఒగ్గిసి ఎట్ట బతుకుతున్నావని....సూదారి యీ పాలి ఏటి సెప్తావో, ఎట్ట సమర్దించుక్కుంటావో...."

ఎదుటపడి అడిగినాది కాదు. యీ తలికి సెల్లున ముప్పయి రొండూ రాలగొట్టేసి సేకల ఎట్టేసి ఉండును. ఇయాల సెప్ప యిసరేత్తావ్, రేపు అయ్యనే తగిలేత్తవ్... మీ తల్లీ కూతుల్లు సెప్పినట్టు యినుకుంటే ఎప్పుడో సిప్ప సేతికొచ్చి ఉండునే....

"ఏటి బాబుగోరు తొంగి తొంగి సూస్తన్ను?"

తుల్లిపడి యిటు తిరిగి సూసిన. ఇద్దరు బికారి ఎదవలు. జెమినీ బయస్కోపు ముంగలి బాకాబాదుతురే, అట్ల గున్నరు. ఆల్లు బలిసిన దున్నపోతులు ఈల్లు బక్కసిక్కిన దిష్టి పిడతలు.

ఆ పెద్ద విడిజీ మీనకి ఎచ్చు జనం రారని మెడలో బంగారం సెయను తీసుకుని పొట్లాం గట్టి లాల్చీ జోబీల ముందే ఏసుకున్న సేతల తడిమి సూసుకున్న.

నా నింక ఏటి సెప్పకుండనె. లోనికి తొంగి సూసి, నా ఒంటి సెప్పు సూసి ఇసయం గ్రెయిం చేసినారు, గట్టైదవలె!

"ఒరొరె ఎంకా, సర్రున లగెత్తి గమ్మన తాడు దీసుకురా" అని ఆల్లలో పెద్దోడు. ఆడికి మాతరం ఎన్ని, పదేల్లుంటాయి గావాల, పురమాయించినాడు సిన్నోడు లగెత్తినాడు.

ఇహ జూస్కో నాయ్నా ఆ పెద్దోడు జలగలా నన్ను పీడించేసినాడు. "బాబ్బాబు....సచ్చి తవ్వరి కడుపున పుడతం....నాకూ తమ్ముడికీ సెరో రూపాయి ఇప్పిగచండి. అందల పడిన సెప్పు బయటికి తీసి తవ్వ పాదాల దగ్గిర ఎట్నాకే. ఆ నొరంగంల దిగిమల్ల బూమ్మీద పడదం ఎంత పెమాదమో కూంత ఆలోచించండి బాబు..."

ఉంకో టయాము అయితే ఉన్న సెప్పు ఒట్టుకుని ఎదవగాడి సెంప అదరగొట్టి ఉండును. పావలా సెయ్యని పాత సరుగు సెప్పకి రెండు రూపాయలు కూలా? ఈ పెపంచంల యింతకన్న అన్నేయం ఉందా?

"పాపం నీ పాత నేస్తాల్ని ఒగ్గేసి యింటికెలా ఒచ్చేవు అయ్యా?" అని గుమ్మంలోనే ఏలాకోలం సేస్తే, సంటి తల్లి, ఏటి సెప్పాల! గుండెల సేరిన అగ్గి నన్ను కూకోనిచ్చినాదికాదు. ఆ టయాంల ఆ ఎదవ అయిదు అడిగినా నోటు యిసిరేసే వోడినే. పేనం పోయినా ఆ సెప్పు అక్కడొగ్గిసి తిరుముకం పట్టుదలుసుకోలేదు. ఆ కిట్టపు గోడి దన్ను సూసుకోని ముండలు మా ఏలాకోలం

సే స్నన్నరు. అయ్యా పంట నేంలో అల్లందరికీ అనుబవం అవాల... సెప్పిచ్చి కొట్టినట్టుండాల గుంటెపప కుదురుగ్గ ఆలోచించుకోనీడే, ఒకటే రొద!

"చెలవివ్వండి బాబు, దిగి సెప్పు ఏమంతరి? రొండు రూపాయి లిప్పిస్తార?' తమరి పేరు సెప్పుకొని పొట్ట నింపుకుంటం. వణ్ణం దిని మూడు పొద్దులయింది బాబు.... పేనం కడగంటి పోతాంది బాబు....ఆకలౌతున్నాది . కాదనమాకండి, బాబ్బాబు.."

ఏటి యీడి అరికత? ఈడి కాకలయితె నాకేంగావాల, యీడి కుటమానం మలమల మాడితే నాకేంగావాల? ఈ పెపంచంల నువ్వు సేసుకున్నాది నీదీ, నాను సేసుకున్నాది నాదీ! వొవడి కరమ ఎటువంటిదొ ముంగలె రాసి ఉంటాది గంద!

నానేటి సెప్పనేలేదు. అట్టగని ఆడు సెప్పింది కొట్టెయ్యనూ లేదు. మరి ఏటి సూసుకుని నా అబిప్పిరాయం గెహించేసినావో, తమ్ముడు సేంతాడు ఒట్టుకు రాగానే ఇద్దరు పనికి తగులుకున్నరు. సేంతా ఓ సివర బిడిజీ కమ్మికి బిగించినారు. రెండోది పెద్ద గుంటడు తన మొలతాడుకి కట్టుకున్నడు.

"ఒరొరె అన్నగా, జాగత్తరో" అని ఎంకడు గొల్లు సేస్తానె ఉండె. పెద్దెదవ కమ్మిలల్ల దూరి తాడు ఒట్టుకొని సర్రున కిందకి జారె.


సెప్పకేం, సూస్తానికి నాకు సెమటలు పోసె.


కనుమూసి తెరిసే సందులగోరం జరిగిపోయె.... సెపిలిని గంద. సావరి కొవరు పూసీ అని.. వొవరు సేసుకున్నది ఆరిదే అని...పుటుక్కున తెగిపాయె.

సేంతాడు కాదు ఆ ఎదవ మొలతాడు!

మొలతాడు కాదు, ఆ ఎకారెదవ పొందితాడు!

ఏ సేదండి. సావుకేక, వుప్పుడుకూడ సెవిలో గింగురు మంతది? గుఎల్లుక కూలిపోయె. ఏదనో ఎవరికెనా? సెప్పితిని గంద, బావిలోతు బురదపేరు కున్నదని.... సీదాగా అందల పడి పోయె... మడిసి ఆనవాలు కాపడకుండ ఆఊబిల కూరుకపోయె! ఆ పై వార్తమానం సెప్పడానికి నోర్రాదునాకు. ఎంకడు సేసిన





గోలకి మరుచణం ఊరు ఊరంతా పెద్ద బిడిజీ నిండివోనారు. పెద్దోడి శవం పైకితీసినారు. పదిమందీ కలసి నన్ను ఒట్టుకున్నారు.

సంటి ముండ సిలక్కి సెప్పినట్లు సెబితే సెవిన బెట్టినాను గాను. శని ముండా సెప్పులు.. రొండు సుట్టు ఈని కాలవల యిసి రేస్తే తెచ్చుకుని కడుక్కుని తొడుక్కున్నాను. శని ఒట్టుకుని పీడిస్తా ఉంటే మంచిబుద్ధి లోస్తద, నువ్వే సెప్మీ! ఇంతకీ ఓ సెప్పు దానిమటుకది దారి సూసుకునే సూసుకుంది. పుట్టల్లో సీమల్లా పుట్టుకొస్తున్న ఆ పెజల్ని సూసి పైపేనాలు పైనే ఎగిరి పోనాయి. దిగమని నాను సెప్పలేదనీ, పైసలు అస సూపి నానో టంట ఒక్కముక్క రాలేదనీ నేసెపితే జనం ఇనుకుంతర! కుడి కాలికి మిగిలిన సెప్పు సాత్రికం ఉండనే ఉండె! ఆ బెజాన దాన్ని ఒదిలుంచుకుందామని ఓణుకుతున్న కాలితో పెయత్నం ఎంత, సేసినా పాదం నుంచి ఇడిపోయి అవతల పడదే! కాలిపల్లు పని సెయ్యవే! సేయని పాపానికి ఇంతోటి సిద్దా!

ఇసీ ఓల్లకి సరదా గుంటదేమోగాని ఆ తరవాత జరిగింది. పెద్ద మనుషుల ముందల సెప్పేది కాదు. తగిలినసోట నేదు తగల్ని సోటనేదు. దబీ దుబీ, దబుకూ దుబుకూ బొక్కలు ఇరగ బొడిసేసివారు. పోలీసోకడు టయము కొచ్చి రచ్చించినాడుగాని ఈ కత సెప్పడానికి ఈ శాల్తీ మిగిలుండేదికాదు. నా పిచ్చిమాట గాని పోలీసాడా రచ్చించేవోడు? పులిసున్నోడికి పోలీసోడిని మించిన సాలీడు ఉన్నాడా! "ఎల్లెల్లవయ్యా సావుకారు నాయల..పాత సెప్పు కోసం పిల్లోడి పేనం బలి ఎట్టావ్.. కూనీకేసు ఐనాయిస్తే ఆకరి మాట ఉరిసిచ్చే... నా లాంటి మంచోడి సేతల సిక్కావు గనక బతికి పోనావు" అనే కచ్చలో సెయెట్టి అది బాబుగోరి సొమ్ము దాసి నట్టు రెండు తులాల సెయను ఊదదీసుకుని, టెంకి జెల్లకొట్టి దేసను నుండి ఇడుదల సేసినాడు!

ఇనుకుంటె ఇసయాలు దాస్తే దాగుతాయా! ఇంటి ఎదవల కెప్పుడో సేరిఉండాల. అడిగినావు గనక సిగ్గిడిచి సంగతంత యివరించిన. ఇంతకీ ఆ ఏల ఆ పెకారం రాసుంది తప్ప మనం సేసేది మన సేతుల ఏటినేదు.

అల్లదిగో ఆ ఏల కాడ్నుంచి సెప్పులే ఒగ్గేసిన! ఒక్క సెప్పేసొలు సగం సంపడానికి, రొండోది కూడా ఏసుకు తిరిగి బతకాలనే! ఇంతకీ పుట్నప్పుడు సెప్పులతో ఒచ్చినామా, ఎల్లే టప్పుడు అటితో తగలడదామా? ఏటో ఎర్రి బెమ! ●